RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 106 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శుక్రవారం 17-4-2026 పేజీలు :8 వెల: 1-00

https://netimanadesam.com/

మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం 2లో

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥అమావాస్య సా॥5.31, రేవతి మ॥12.05, వర్జ్యం లేదు, దుర్ముహూర్తం ఉ॥ 8.24-9.12, శుభ సమయం ఉ॥ 7.30-9.00, రాహుకాలం ఉ॥10.30-12.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

## చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

లోక్‌సభలో మహిళాబిల్లు, డీలిమిటేషన్ బిల్లులు.... డివిజన్ కోరిన విపక్ష సభ్యులు..స్పీకర్ అంగీకారం

సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆర్ఎన్ఎ):** దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించ నున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతో పాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల మిగతా 2లో..

## మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆర్ఎన్ఎ):** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా మిగతా 2లో..

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం

## మంత్రాలయం ప్రమాద ఘటన

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం
- ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రులు



**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మంత్రాలయం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. మంత్రాలయం క్షేత్రం దర్శనం కోసం వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారని అధికారులు వివరించారని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కర్ణాటకలోని ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని బాధిత కుటుంబాలకు తగిన సహాయం చేయాలని కూడా సూచించామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో కర్ణాటకకు చెందిన 8 మంది మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బొలెరో వాహనం రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు మిగతా 2లో..

## బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

- పెట్టుబడులు వస్తే తట్టుకోరా జగన్ గారూ
- ఇదేం రాక్షస మనస్తత్వమో: మంత్రి లోకేశ్ ఆగ్రహం




**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు.దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు మిగతా 2లో..

## నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత... - భానుడి భగభగలతో ఇంటికే పరిమితమైన జనం

- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

**విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో




అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు మిగతా 2లో..

गृह मंत्रालय भारत सरकार

# మన జనగణన - మన అభివృద్ధి

(జనగణన 2027 మొదటి దశ)

స్వీయ లెక్కింపు (SE) పై సాధారణ ప్రశ్నలు మరియు సమాధానాలు (భాగం-1)

స్వీయ లెక్కింపు అంటే ఏమిటి?

స్వీయ లెక్కింపు అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. ఇందులో మీరు మీ కుటుంబ వివరాలను SE పోర్టల్ (se.census.gov.in)లో మీరే నమోదు చేసి సమర్పిస్తారు, ఎన్యూమరేటర్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు.



- స్వీయ లెక్కింపు తప్పని సరా?
  కాదు, ఇది ఒక అదనపు సౌకర్యం మాత్రమే. మీరు చేయకపోతే, ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారు.
- ఏ భాషలో అయినా స్వీయ లెక్కింపు చేయవచ్చా?
  ఈ సౌకర్యం హిందీ, ఇంగ్లీష్ మరియు 14 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది.
- స్వీయ లెక్కింపుకు ఇంటర్నెట్ అవసరమా?
  అవును, పోర్టల్ ఉపయోగించడానికి ఇంటర్నెట్ అవసరం.
- నా సమాచారం సురక్షితమా?
  అవును, మీ సమాచారం మొత్తం సురక్షితంగా, ఎన్‌క్రిప్ట్ చేసి ప్రభుత్వ సర్వర్లలో నిల్వ చేస్తారు.
- SE ID అంటే ఏమిటి? దాని ఉపయోగం ఏమిటి?
  మీరు వివరాలు సమర్పించిన తర్వాత, మీకు ఒక ప్రత్యేకమైన 11 అంకెల SE ID వస్తుంది (SMS / Email ద్వారా కూడా వస్తుంది). ఈ ID ని ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు చూపాలి.
- SE ID మర్చిపోతే ఏమి చేయాలి?
  మీ రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ ద్వారా పోర్టల్‌లో తిరిగి పొందవచ్చు.
- స్వీయ లెక్కింపు తర్వాత ఎన్యూమరేటర్ వస్తారా?
  అవును, ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చి SE ID ద్వారా మీ వివరాలు ధృవీకరిస్తారు.
- ఏమైనా పత్రాలు అప్లోడ్ చేయాలా?
  లేదు, ఏ పత్రాలు అప్లోడ్ చేయాల్సిన అవసరం లేదు.
- పోర్టల్‌లో సహాయం ఉందా?
  అవును, యూజర్ గైడ్, ఫ్లోచార్ట్, ట్యుటోరియల్ వీడియోలు, FAQS మరియు టూల్ టిప్స్ అందుబాటులో ఉంటాయి.

టోల్ ఫ్రీ - 1855

CBC 19108/13/0018/2627

మన బాధ్యతను నెరవేర్చుకుందాం, జనగణనలో పాల్గొనండి CensusIndia2027

## ఎంజీఎం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**తొట్టంబేడు,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎంజీఎం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కిండర్ గార్డెన్ నుండి లోయర్ స్కూల్కు, లోయర్ స్కూల్ నుండి హైర్ స్కూల్‌కు ప్రమోషన్ పొందిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ గౌన్, టోపీ ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు చేసి కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ ఆసక్తులను గుర్తించి, ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ వేడుకలకు ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, స్కూల్ హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది హాజరయ్యారు.

## కార్డన్ సెర్చ్‌లో 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**గూడూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్, దండోరా కాలనీలో గురువారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా 60 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించి గంజాయి వినియోగం దుష్ప్రభావాలు, అత్యవసర సేవల కోసం 112 నంబర్ వినియోగం, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, దొంగతనాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు టు టౌన్, వన్ టౌన్, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ చర్యలు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి.

## ఒలంపియాడ్ పరీక్షలో గూడూరు విద్యార్థుల ప్రతిభ

**గూడూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరులోని సనత్‌నగర్‌లోని శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఐ.ఎన్.టి.ఎస్.ఓ. సెకండ్ లెవెల్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ కనపరిచారు. శ్రీ చైతన్య గూడూరు బ్రాంచ్ నుంచే అత్యధిక సంఖ్యలో 330 మంది విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసులు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. అనంతరం పురపాలక కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కమిషనర్, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం శ్రీకాంత్, పాఠశాల డీన్లు శ్రీహరి బాబు,హరి బ్రహ్మ యాదవ్,గాంధీ, ఒలంపియాడ్ ఇంచార్జిలు మల్లీ సింగ్,సాయి చందన, ప్రైమరీ ఇంచార్జిలు చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరులో స్వీయగణన

**చిల్లకూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన 2027లో భాగంగా గురువారం నుంచి ఏప్రిల్ 30 వరకు స్వీయ గణనను చిల్లకూరులో ప్రారంభమైంది. శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు నీరజ , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కొండా రామ చంద్రారెడ్డి నాయకులు పట్టాభి రెడ్డి , దాసరి రామ్ ప్రసాద్ తదితరులు స్వీయ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్ అమ్రుల్, వార్డు ఇంచార్జ్ పరిపాలనా కార్యదర్శి శివ కృష్ణ తదితరులు ఉన్నారు.

## గోదావరి జలాల వినియోగంపై యాక్షన్ ప్లాన్

### రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళికలు....

### సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో చంద్రబాబు ఆదేశం



**అమరావతి,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాల్వల ద్వారా తరలించి.. వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ కాల్వలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్-1 పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఈమేరకు సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం- నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జలధార, జల హారతి కార్యక్రమాలపైనా సమీక్షించారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై నిర్మించ తలపెట్టిన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగడంతో త్వరితగతిన టెండర్లు పిలవాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని.. హోటల్స్, షాపింగ్ ఏరియా ఉండాలని తెలిపారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను పరిశీలించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయని అధికారులు వివరించారు. ఏప్రిల్ 1 నాటికి 625 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 12 టీఎంసీల నీరు అదనంగా ఉందని తెలిపారు. అదేవిధంగా గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏప్రిల్ నాటికి 0.79 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పెరిగాయన్నారు.

## గ్యాస్ సిలిండర్ వాడకంలో భద్రత ముఖ్యం

**సత్యవేడు,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్యాస్ సిలిండర్ వాడకంలో భద్రత ముఖ్యమని సత్యవేడు అగ్నిమాపక కేంద్రాధికారి రాజయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం, స్థానిక నేతాజీ రోడ్లో, విఎన్ పరమశివం అపార్ట్మెంట్ గృహిణిలకు గ్యాస్ సిలిండర్ వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రాధికారి రాజయ్య మాట్లాడుతూ వంట పూర్తయిన తరువాత రెగ్యులేటర్ ఆఫ్ చేసుకోవాలన్నారు . ఒకవేళ గ్యాస్ వాసన వస్తే కిటికీలు తెరవాలన్నారు. సిలిండర్లో గ్యాస్ ఎంత ఉందో తెలుసుకోవడానికి తడి గుడ్డను సిలిండర్ చుట్టూ చుట్టి 2 నిమిషాల తర్వాత పరిశీలిస్తే ఎండిపోయిన భాగం గ్యాస్ స్థాయిని సూచిస్తుంది అన్నారు. సిలిండర్ మార్చినప్పుడు సబ్బు నీటితో లీకేజ్ ఉందేమో చూసుకోవాలన్నారు. సిలిండర్‌ను ఎల్లప్పుడూ నిటారుగా చల్లనిగాలి ఆడే ప్రదేశంలో ఉంచాలన్నారు. నీలం రంగు మంట ఉంటే గ్యాస్ బాగున్నట్లు, పసుపు రంగు ఉంటే గ్యాస్ అయిపోవచ్చని తెలుసుకోవాలన్నారు. వంట పాత్రలపై మూత పెట్టడం, పొడి గిన్నెలను వాడటం ద్వారా గ్యాస్ ఆదా చేసుకోవచ్చని ఆయన వివరించారు. గ్యాస్ వాసన వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆపి కిటికీలు, తలుపులు తెరిచి ఎలెక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయకూడదన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

### కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు... బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే

### విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు.కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటమి నిర్ధారణ కావడంతో, అర్ధాంతరంగా ఈ బిల్లును ప్రవేశపెట్టాలని అధికార బీజేపి భావిస్తోంది. డీ లిమిటేషన్ ద్వారా నార్త్, ఈస్ట్, సౌత్, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. లోక్‌సభ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తాము' అని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. ప్రభుత్వం తెచ్చిన విధానమే తప్పు. రాజకీయ లబ్ది కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్లే నియోజకవర్గాల విభజనలో అవకతవకలకు కేంద్రం యత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం చేయడానికే కేంద్రం సాకులు వెతుకుతోంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడతాయి' అని అన్నారు.

## జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే

### అందుకే రాష్ట్రాల్లో 50 శాతం పెంపు... బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి

**హైదరాబాద్,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు. 1972 లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల ఏపీకి ఒక లోక్‌సభ సీటు తగ్గింది. ప్రస్తుత సీట్ల ప్రకారమైతే మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే 270కిపైగా సీట్లు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హైబ్రిడ్ పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని తెలిపారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది ఎక్కడ ఉందో చెప్పాలని అన్నారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని తెలియదా అని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాల తీరుపై మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరికాదని అన్నారు.

## డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త కోణం

### కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు ఆర్థిక బంధం

**హైదరాబాద్,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.

## అమరావతి పేరులోపై స్పష్టత

**అమరావతి,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** ఏపీ రాజధాని అమరావతి పేరుపై స్పష్టత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి అన్ని అధికారిక నోట్‌లు అమరావతి ఇంగ్లీషులో చివరన టిఐ పేరుతోనే ఉండాలని స్పష్టం చేశారు. కొందరు టిఐ బదులు టిహెచ్ఐ అని రాయడాన్ని తప్పుబట్టారు. అమరావతిని ఇంగ్లీష్‌లో రాసేటప్పుడు చివరిలో టిహెచ్ఐ కి బదులుగా టిఐ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు, అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

### యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే... డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం

### మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు... రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.




## రాప్తాడులో అట్టహాసంగా అన్న క్యాంటీన్ ప్రారంభం

### - ముఖ్య అతిథిగా ఎంపీ పార్థసారథి

**రాప్తాడు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదవాడికి మూడు పూటలా అన్నం పెడుతుంటే జగన్ ఓర్వలేకపోయాడని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎంపీ పార్థసారథి ఆరోపించారు. నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే, ఎంపీకి స్థానిక నాయకులు, ప్రజలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సునీత, ఎంపీ పార్థసారథి క్యాంటీన్‌లో భోజనం చేశారు. అనంతరం 10 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ మండల కేంద్రాలకు, నియోజకవర్గ కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే.. జగన్మోహన్ రెడ్డి కక్ష పూరితంగా మూపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే 200క్యాంటీన్లను ప్రారంభించా రన్నారు. ప్రస్తుతం మరో 65క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. అనంతరం వచ్చిన జగన్‌రెడ్డి ఇవి కొనసాగితే ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచిపేరు వస్తుందన్న ఉద్దేశ్యంతో వాటిని మూసివేయించారన్నారు. చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చాక.. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారన్నారు. రాప్తాడులో ఎప్పటి నుంచో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందన్నారు. పనులు ప్రారంభించిన 6నెలల్లోగానే 61లక్షలతో క్యాంటీన్ నిర్మాణం చేసినట్టు చెప్పారు. రాప్తాడు మండల కేంద్రంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హరే కృష్ణ మిషన్, అక్షయపాత్ర వారికి అప్పగించినట్టు చెప్పారు. పుట్టినరోజు, పెళ్లిరోజులంటూ వృథాగా డబ్బు ఖర్చు చేసేవారు అన్నక్యాంటీన్ల వద్ద తమ పేరుతో ఉచితంగా భోజనం అందించవచ్చన్నారు. ముందే సంప్రదించి.. డబ్బు చెల్లిస్తే వారే అన్నదాన కార్యక్రమం చేస్తారన్నారు. ఈ క్యాంటీన్ లో భోజనం తినే వారి సంఖ్యను బట్టి మరింత మందికి అందించేలా చూస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

## పీఎం సూర్య ఘర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

### - కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అమలుపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని హిందూపూర్, కదిరి, పుట్టపర్తి డివిజన్ల వారీగా అందుతున్న దరఖాస్తులు, గ్రౌండింగ్ పురోగతిని ఆయన పరిశీలించారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 45,428 దరఖాస్తులు నమోదు కాగా, అందులో 45,407 దరఖాస్తులకు ఫిజిబిలిటీ ఆమోదం లభించింది. హిందూపూర్ డివిజన్ 25,117 దరఖాస్తులతో ముందంజలో , పుట్టపర్తి 10,942, కదిరి 9,369 దరఖాస్తులను కలిగి ఉన్నాయి. ప్రత్యేకంగా ఎస్సీ/ఎస్టీ విభాగంలో 40,486 దరఖాస్తులు నమోదు కాగా, వందలాది ఇళ్లలో ఇప్పటికే సోలార్ ప్యానెళ్ల అమరిక (Installation) పూర్తయింది. జిల్లాలోని 12 ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ల కోసం 272.4 ఎకరాల భూమిని గుర్తించామని, ఇందులో ఇప్పటికే 153.7 ఎకరాలకు అడ్వాన్స్ పొసెషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. సబ్సిడీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో త్వరగా జమ అయ్యేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్స్పెక్షన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వెండర్ల పనితీరును పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో APSPDCL ఎస్ఇ మోసెస్, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, MEPMA పిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరవండ్లపల్లి అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండ

**అనంతపురం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలోని కదిరి నియోజకవర్గం, కుమ్మరవండ్లపల్లిలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందడం పట్ల అధికారులు తీవ్ర దిగ్భ్రాంతిని, బాధిత కుటుంబాలకు తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు . మరణించిన నలుగురి కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, మరో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళు కోల్పోయిన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా నూతన గృహాలను మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ప్రమాదంలో గాయపడిన 24 మందిని ఆసుపత్రికి తరలించగా, ఇప్పటికే 7 మంది డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన వారు త్వరలోనే కోలుకుంటారని, ఒకరికి తీవ్ర గాయాలవ్వడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## గ్రంథాలయాలకు వసతులు సమకూరుస్తా

### - నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్



**నెల్లూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి వారి తండ్రిగారైన స్వయంపాకుల గోపాలకృష్ణయ్య జ్ఞాపకార్థంగా గ్రంథాలయానికి రిఫ్రిజిరేటర్ అందజేశారు. ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడంతో గ్రంథాలయ పాఠకులకు, కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం రిఫ్రిజిరేటర్ అందించినట్లు ఆమె తెలిపారు. గ్రంథాలయానికి అన్ని వసతులు సమకూర్చేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## జీవన సురక్ష బీమా చెక్కు పంపిణీ




**రామచంద్రపురం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లెక్కల రామ్మూర్తి భార్య లెక్కల శశికళకు ఎస్ జి బి సురక్ష బీమా రూ.5 లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. గురువారం కుప్పం బాదూరులోని గ్రామీణ బ్యాంక్ లో రీజనల్ మేనేజర్ కామేశ్వరరావు, కుప్పం బాదూరు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, యూనివర్సల్ సోంపో బీమా ప్రతినిధి హేమాద్రిలు నామినీకి బీమా చెక్కును అందజేశారు. గతంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్, యూనివర్సల్ సోంపో బీమా కంపెనీల ఒప్పందం మేరకు ఖాతాదారుల నుండి ఎస్ జి బి సురక్ష బీమాను లెక్కల రామ్మూర్తిచే చేయించారు . ఎస్ జి బి సురక్ష పాలసీదారుడైన లెక్కలు రామ్మూర్తి పాలసముద్రం వద్ద 13/5 /2025 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి భీమా ఒక ధీమా అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, అటల్ పింఛన్ యోజన పథకాలలో బీమా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్దాం

**- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**



**రామకుప్పం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సంజీవిని హెల్త్ కార్యక్రమం ప్రజల ఆరోగ్య పరిరక్షణ ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్దామని శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం కడ, ప్రత్యేక అధికారీ వికాస్ మరమత్ పేర్కొన్నారు. రామకుప్ప మండల పరిధిలోని విజలాపురం వీర్నమల, రామకుప్పం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు సిబ్బంది హాజరు స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను పరిశీలించారు. పేదల కోసం ప్రవేశపెట్టిన సంజీవిని కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు సంజీవిని నంబర్ 15337 కు కాల్ చేసి తమ ఆరోగ్య సమస్యలు స్థానిక డాక్టర్ల వద్ద చర్చించుకోవచ్చు నన్నారు. ప్రజలు తమ సహాయ సహకారాలు అందించి సంజీవిని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వైద్యం శాంతారామ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామ్రాజనాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి ఎంపీపీ సులోచన గురప్ప, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఎస్టి సెల్ అధ్యక్షుడు నర్సింహులు కడ అడ్వైసింగ్ కమిటీ మెంబర్ రఘు, క్లస్టర్ ఇంచార్జ్, రవి రెడ్డి,తాసిల్దార్ కౌలేష్, ముఖ్య నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, బాలకృష్ణ, వైద్యశాఖ అధికారులు గంగాభవాని, డాక్టర్ లోకేష్, పంచాయితీ ఈవో సోమశేఖర్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వ్యవసాయ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఈ సి ఆర్ పి, ఎఫ్ ఎం టి ఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయ అధికారి సంధ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వ్యవసాయ పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించడమైనది. రైతులు మేలైన ప్రకృతి సేద్య విధానాలను అవలంబిస్తే భూమి నీరు సంరక్షణతో పాటు ఆరోగ్యకరమైన పంట సాగుకు , సహజ సిద్ధమైన ఆహారం లభిస్తుందని సిబ్బందికి తెలియజేశారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బీజామృతం, ద్వారా, భూసారం కాపాడవచ్చునని వివిధ కషాయాల ద్వారా పంటల్లో ఉన్న చీడపీడల నివారణకు సహకరించే పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ కేంద్రం సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యకర్తల సమీక్ష సమావేశం



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆరోగ్య కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశం సబ్ యూనిట్ ఆఫీసర్ కెసి జయశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా కీటక జనిత వ్యాధులైన దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా చికున్ గున్యా డెంగ్యూ బోదకాలు మెదడు వాపు జ్వరాల గురించి అవగాహన కల్పించినారు. గ్రామాలలో వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించినారు. కలుషితమైన నీరు , ఆహారం ద్వారా వచ్చే వ్యాధులు టైఫాయిడ్ పచ్చకామెర్లు, అతిసార మొదలైన వ్యాధుల గురించి అవగాహన కల్పించినారు. గ్రామాలలో ముఖ్యముగా పైప్ లైన్ లీకేజెస్ గుర్తించి పంచాయతీ సెక్రెటరీ, వార్డు సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి వాటిని అరికట్టడం ద్వారా నీటి ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీనింగ్ క్లోరినేషన్ జరిగేటట్లు చూడవలసినదిగా ఆదేశించారు. సమావేశంలో కీటక జనిత వ్యాధుల గురించి కరపత్రికను సబ్ యూనిట్ ఆఫీసర్ కెసి జయశంకర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు రాజారెడ్డి, బలరాం, యరపరెడ్డి, వెంకటరమణ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ బలిజ సంఘం ఆశయ సాధనకు కృషి చేస్తా

**- వై.దుర్గా హరి ప్రసాద్**



**కందుకూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణ బలిజ సంఘం ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర కో ఆప్షన్స్ సభ్యులు యర్రంశెట్టి దుర్గా హరి ప్రసాద్ అన్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర 14వ మహాసభలో యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ రాష్ట్ర కమిటీలో ఎన్నికైన సందర్భంగా కందుకూరు పట్టణంలోని కొత్తపాలెంలో కృష్ణ బలిజ సంఘం పెద్దలు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సముచిత స్థానం కల్పించినందుకు కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి శ్రీనివాసరావుకు, రాష్ట్ర కమిటీకి, తనపై నమ్మకం ఉంచి తనను ముందుకు నడిపించిన కందుకూరు కృష్ణ బలిజ సంఘం పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం తమ కృష్ణ బలిజ సంగీయులు బీసీ డీ గా పరిగణించబడుతున్నారని తద్వారా రిజర్వేషన్లను కోల్పోయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బీసీ డీ నుండి బీసీ ఏకి మార్చేందుకు రాష్ట్ర నాయకత్వం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణ బలిజ సంగీయులను గుర్తించి బీసీ డీ నుండి బీసీఏ కి మార్చాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో ప్రతి కృష్ణ బలజ సంఘీయుడు తమ పేర్లను నమోదు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి కృష్ణ బలిజ సంఘీయుల సంఖ్యను తెలిసేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కృష్ణబలిజ సంఘం పెద్దలు యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ను చాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బలిజ సంఘం కొత్తపాలెం పెద్దలు బండి భాస్కరరావు, నీలి శెట్టి రమణయ్య, పాశం బాలయ్య, పాశం శ్రీనివాసులు, నాయుడు మాల్యాద్రి, నీలిశెట్టి నారాయణ, యర్రంశెట్టి కోదండ రామయ్య, పసుపులేటి బాలకృష్ణ, నీలిశెట్టి నరసయ్య, చెన్నం శెట్టి చందు, ముద్రకొలను మాలకొండయ్య, పాశం సుబ్రమణ్యం, పాశం అయ్యప్ప, పాశం శ్రీకాంత్, పాశం సాయి, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణా తరగతులను పరిశీలించిన కలెక్టర్



**చిత్తూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనగణన - 2027 లో భాగంగా చిత్తూరు సంతపేట పీఎన్సీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మొదటి దశ ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ తరగతులను గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. శిక్షణ తరగతులను పరిశీలించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లతో మాట్లాడారు. శిక్షణలో భాగంగా జనగణన సర్వేపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. మే 1వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్యుమరేటర్లు జనగణన నిర్వహించేటప్పుడు ప్రజలు అడిగే ప్రశ్నలకు, వారి అనుమానాలను నివృత్తి చేసేందుకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచారం సేకరించాల్సిన ప్రశ్నలకు సంబంధించి అవగాహన పెంచుకొని, ప్రజల నుంచి సరైన సమాధానాలు తెలుసుకోవాలన్నారు. పోర్టల్లో అందుబాటులో ఉన్న "స్వీయ గణన " పైనా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీలు నాగేంద్ర, సుభప్రభ, మాస్టర్ ట్రైనర్ సౌందర్ రాజన్, ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## శ్రీ గంగాధరేశ్వర స్వామి వారి పున: ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి




**పెద్దపంజాణి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని రాజపల్లి పంచాయతీ, కమ్మి నాయనపల్లి గ్రామంలోని శ్రీ గంగాధరేశ్వర స్వామి వారి పునః ప్రతిష్ఠ మండల అభిషేక పూజ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



**చిత్తూరు,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వచ్చే విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి జిల్లాకు మంచి స్థానం వచ్చేలా కృషి చేస్తామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డిఐఈఓ ) రఘుపతి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మండలి విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో జిల్లాకు సంబంధించి 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 71 శాతం ఫలితాలు సాధించామని వెల్లడిం చారు. పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చిన, ఫెయిల్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనలకు గురికావద్దని, అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల ద్వారా ఉత్తమ మార్కులు సాధించవచ్చని సూచించారు. ఇందుకు సంబంధించి 20 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే నెల 21వ తేదీ నుంచి జూన్ 4 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించబ డతాయని, జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 30 రోజుల పాటు రెమిడీయల్ తరగతులు నిర్వహించబడతాయని, ఈ అవకా శాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధిం చాలని డిఐఈఓ సూచించారు.

## ఎంవిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలలో సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ విభాగంలో మౌనిక 491, పద్మ శ్రీ 489, సుమ 484, ఎం ఇ సి పల్లవి491, జాహ్నవి 488, సాయి చరణ్ 486, సుమన్య 487, ఎంపీసీ విభాగంలో వి.దీపిక 462, శ్రీనిధి 462, దీక్షిత 461, బైపిసి ఎన్.భావన 446, పి.సాయి గణేష్ 433, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమైన మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో దేవి శ్రీ 988, తరుణ్ 987, చరణ్ 986, బైపీసీ విభాగంలో హారికా రెడ్డి 987, ఇక్రా 984, త్రా ఫిక్ 980, సి ఈ సి విభాగంలో మనీషా 977, ఎం ఈ సి విభాగంలో కె.కీర్తి 962, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాలలో ఐదు స్థానాలలో ఒకరుగా నిలవడం జరిగిందన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను కళాశాల కరస్పాండెంట్ ఎం.వి.ఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధా, అధ్యాపక బృందం అభినందించారు.



# చిత్తూరు జిల్లా

## ఇంటర్ ఫలితాల్లో ' ఆర్కే' ప్రభంజనం



**చిత్తూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో స్థానిక మిట్టూరులోని రుక్మిణి కృష్ణసాయి ( ఆర్కే ) జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించింది. కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సీఈసీ అన్ని విభాగాల్లోనూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంఈసి గ్రూపుకు సంబంధించి ఎస్.ఉషశ్రీ 493 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానం సాధించడం విశేషం. ఈ గ్రూపులోనే పూర్ణిషా, ప్రజ్ఞా రెడ్డి 492 మార్కులు చొప్పున సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆర్.చందన 464, జ్యోత్స్న 458, మహేష్, విద్యశ్రీ 456 మార్కులు సాధించారు. బైపీసీలో సఖియామాఫాజా 440, సీఈసీ గ్రూపులో సుహానా 458 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో ఎస్ షాలిని 982, ఎంఈసి గ్రూపులో గౌతమి 981, బైపీసీ గ్రూపులో డి.పూజ 979, సిఇసి గ్రూపులో టి.పవిత్ర 937 మార్కులను సాధించారు. కళాశాలలోని అన్ని విభాగాలకు సంబంధించి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీనివాస ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కల్పజ, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ మునిరత్నంరెడ్డి, కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

## పలమనేరులో బుల్లెట్ ట్రైన్ సాధన మహా ర్యాలీ

**- అభివృద్ధి కోసం కదం తొక్కనున్న సర్వజన శ్రేణులు**



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు ప్రాంత ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, చెన్నై-బెంగళూరు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో పలమనేరును విడదీయలేని భాగంగా మార్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలో భారీ ఎత్తున 'బుల్లెట్ ట్రైన్ సాధన మహా ర్యాలీ' నిర్వహించ నున్నారు. పలమనేరు పరిరక్షణ సమితి ( పి పి ఎస్) నేతృత్వంలో జరగనున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా తరలిరావాలని సమితి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ర్యాలీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పి పి ఎస్ అధ్యక్షులు టి.ఎల్. నరసింహులు, ప్రధాన కార్యదర్శి వి. నారాయణ మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హై-స్పీడ్ రైలు కారిడార్లో పలమనేరు వంటి కీలక రెవెన్యూ డివిజన్ను విస్మరించడం ప్రాంతీయ వివక్షేనని మండిపడ్డారు. రామాపురం - కోలార్ మధ్య 80 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ, వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన పలమనేరులో స్టాప్ ఇవ్వకపోవడం వల్ల ఇక్కడి విద్యార్థులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు, రైతులు, పారిశ్రామికవేత్తలు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మిట్టపైన గల ఎన్జీఓ హోం నుండి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ జవిలి వీధి, బజార్ వీధి, గంగమ్మ గుడి వీధి మీదుగా సాగి నెహ్రూ విగ్రహం సర్కిల్ వద్ద బహిరంగ సభతో ముగుస్తుంది. పలమనేరు గళాన్ని ఢిల్లీ, అమరావతి పాలకులకు వినిపించేలా ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పి పి ఎస్ నాయకులు విజయకుమార్ రెడ్డి, పొన్ముడి, వెంకట్, రెడ్డెప్ప నాయుడు, రామచంద్ర, జీలు భాయ్, శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్, నిసార్, సురేంద్ర, సాంబయ్య, జగన్నాథం, శేఖర్, వెంకటేశ్వర్లు, మురళి,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఘన సన్మానం



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఘన సన్మానం చేశారు. పలమనేరు గవర్నమెంట్ కాలేజీలో, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన, మొదటి బైపిసి విద్యార్థులైన లిఖిత, మౌనిక, జయంతి విద్యార్థులకు గురువారం పలమనేరు సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్ రావు, వారి టీమ్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీకి వెళ్లి, చిరు సత్కారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కన్నయ్య, లెక్చరర్ శ్రీనివాసులు, సుధారాణి,స్వాతి, హేమ, ప్రియ, వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



**పలమనేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పలమనేరు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని ఆరు గ్యాస్ ఏజెన్సీలను యాజమాన్యాలను వారి సిబ్బందిని సమాయత్న పరిచి అవేర్నెస్ అండ్ మక్ డ్రిల్ల్ నిర్వహించడమైనది. ఈ ఏడాది నినాదం: "సురక్షిత పాఠశాలలు, సురక్షితమైన ఆసుపత్రులు అగ్ని మాపక భద్రతపై స్పృహ ఉన్న సమాజం మంటలను నివారించడానికి కలిసి పనిచేస్తాయి. "వారోత్సవాల కార్యక్రమ ప్రణాళిక లో భాగంగా సౌమ్య గ్యాస్ ఏజెన్సీ ఆఫీస్, గుడియాత్తం రోడ్, పలమనేరు వారి సహకారంతో పలమనేరు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని 6 గ్యాస్ ఏజెన్సీల (పలమనేరు-4, పెద్దపంజాణి-1, బైరెడ్డిపల్లి-1) ల యాజమాన్యం, సిబ్బంది, పట్టణ ప్రజలతో కలసి ఎల్పిజి గ్యాస్ నిర్వహణ రక్షణ చర్యలు, వాటి నిలువ, ప్రజలకు దానిపైన అవగాహన కలిగించాలని గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి, యాజమాన్లకు తెలియపరచి, తద్వారా గ్యాస్ డెలివరీ అయ్యే సందర్భంలో ప్రజలకు గ్యాస్ ఫైర్ల గురించి అప్రమత్తత కలిగి ఉండే విధంగా, ముందస్తు అప్రమత్తత చర్యలు, నివారణ చర్యలను తెలియపరచడం జరిగింది. అగ్ని ప్రమాదాలను నివారించడం ద్వారా తమ, ధన, ప్రాణ నష్టాలను నివారించి జాతీయ భద్రత దేశాభివృద్ధికి ప్రజలు తోడ్పడతారని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది మరియు మక్ డ్రిల్ల్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రాము నిర్వహించడమైనది. వాల్ పోస్టర్స్ కరపత్రముల పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పి మనోగరన్, అగ్నిమాపక కేంద్రాధికారిఎం. నరేష్,సి.సుమన్, లీడింగ్ ఫైర్ మాన్, సిబ్బంది పాల్గొనడం జరిగిందన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు

**పుంగనూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ కె.సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు కరపత్రాలను పంచి, గ్యాస్ సిలిండరు డెలివరీ తీసుకునే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు, గ్యాస్ లీక్ అయినప్పుడు , అగ్ని ప్రమాదాలకు గురైనప్పుడు తీసుకోవలసిన నివారణ చర్యలను డెమో ద్వారా తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అగ్నిమాపక సిబ్బంది, ఇ.సుబ్రమణ్యం, వి. లక్ష్మీనారాయణ, పి. ప్రసాద్ , జి. వెంకటరమణ, వి. కేశవ, బి. వినోద్ కుమార్, కె. మోహన్ బాబు, ఎస్.ఆర్. వి. ప్రకాష్, పి. ఆనంద పాల్గొన్నారు.

## 'స్మార్ట్ కిచెన్' విధానాన్ని రద్దు చేయాలి

### - సీఐటీయూ కార్యదర్శి పి.రాజేశ్వరి

### - ఏప్రిల్ 22 న స్మార్ట్ కిచెన్ ఏర్పాటు నిరసిస్తూ ధర్నా

**మదనపల్లె, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలువుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని 'స్మార్ట్ కిచెన్' పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ప్రభుత్వ ప్రయత్నాలను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ విధానం వల్ల 20 ఏళ్లుగా ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది పేద మహిళా కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మదనపల్లెలోని ఎన్ఓ హోంలో జరుగిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సదస్సు ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి రెండు స్మార్ట్ కిచెన్లను ఏర్పాటుచేసి, ఈ పథకాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం వల్ల కార్మికుల పొట్ట కొట్టడమే కాకుండా, విద్యార్థులు వేడి వేడి అన్నానికి దూరం అవుతారని వివరించారు. 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం తన వాటా గౌరవ వేతనాన్ని పెంచలేదని, ప్రస్తుతం కేంద్రం రూ. 600, రాష్ట్రం రూ. 400 ఇస్తుండగా, కార్మికుల పోరాటాల ద్వారా మరో రూ.2 వేలు అదనంగా సాధించుకున్నట్లు తెలిపారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారు మెజారిటీగా పేద కుటుంబాలకు చెందిన మహిళలేనని, వీరు రోజుకు 7 నుండి 8 గంటలు పనిచేస్తున్నా, నెలల తరబడి వేతనాలు, బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. 11 నెలలు పనిచేయించుకుని కేవలం 10 నెలలకే జీతం ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. వంట చేసే సమయంలో ప్రమాదాలకు గురై మరణించినా లేదా గాయపడినా ఆర్థిక సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ మాట్లాడుతూ 45వ జాతీయ కార్మిక సదస్సు సిఫార్సుల ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులను 'కార్మికులు'గా గుర్తించి, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, స్మార్ట్ కిచెన్ ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలని, ప్రైవేటీకరణను ఆపాలని, మెనూ ఛార్జీలను ఒక్కో విద్యార్థికి కనీసం రూ. 20కి పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పరిష్కారం చెయ్యాలని కోరుతూ ఈ నెల 22 న మదనపల్లి లో నిరసన ధర్నా నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రెడ్డెమ్మ, ప్రమీల, షంషాద్, ఆశా, రెడ్డిరాణి, మస్తాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి



**రామసముద్రం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల వెలుగు కార్యాలయంలో గురువారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక (ఏసిఎల్పి) తయారీపై వీఓఏలు, ఈ-నారీమణులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం సాంబశివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి వీఓకు 20 మంది వ్యవస్థాపకులను తయారు చేయాలని సూచించారు. ఏసిఎల్పి సర్వేలో జీవనోపాధులపైనే ప్రధానంగా దృష్టి సారించాలని, రుణాలలో 50 శాతం జీవనోపాధులకు, మిగతా 50 శాతం ఇతర అవసరాలకు కేటాయించేలా చూడాలని తెలిపారు. ఏసిఎల్పి తయారీ విధానం, ముందస్తు ఏర్పాట్లపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ పుంగనూరు చీఫ్ మేనేజర్, ఏపీజీబి రామసముద్రం, చెంబకూరు శాఖల మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు, ఈ-నారీమణులు, ఎంఎస్‌వోలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

## చెంబకూరులో బహిరంగ వేలం



**రామసముద్రం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం చెంబకూరు గ్రామపంచాయతీలో గురువారం వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ గేటుకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో క్రిష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో వారపు సంత, దినసరి మార్కెట్‌కు రూ.2,89,430, బస్టాండ్ గేటుకు రూ.67,568గా కలిపి రూ.3,56,998 ఆదాయం సమకూరింది. వేలంపాటలో ముగ్గురు పాల్గొనగా, దిన్నిమీద హరిజనవాడకు చెందిన గొర్రెల శంకర్ అత్యధిక బిడ్‌తో హక్కులు దక్కించుకున్నారు. వేలాన్ని నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## జీవితాన్ని ప్రతిబింబించేది నాటకం

**కడప, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జీవితాన్ని ప్రతిబింబించేది నాటకమైతే నాటకానికి ప్రతిస్పందించేది జీవితమని, నాటకం ఆహ్లాద కరమైందని, సర్వజనామోద యోగ్యమైందని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం కడప శంకరాపురం శాంతినికేతన్ హై స్కూల్ లో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరి వీరేశలింగం చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాటక రంగంలో తొలి నాటక కర్త, తొలి దర్శకు డు, తొలి ప్రదర్శకులైన కందుకూరి జన్మదినాన్ని ప్రభుత్వం 2007 నుండి తెలుగు నాటకారంగ దినోత్సవంగా అధికారికంగా నిర్వ హించడం సముచితమన్నారు. నవయుగ వైతాళికులైన కందుకూరి వీరేశలింగం ఆనాటి ప్రజల మనో భావాల్లో మార్పులు తెస్తూ సమా జాన్ని సంస్కరించాలని నాటకాలు వ్రాశారన్నారు. ఆయన వివేకవర్ధిని పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేటందుకు కృషి చేశారన్నారు. నాటక రంగానికి కృషి చేస్తున్న రంగస్థల కళాకారు లు పూర్వ శాసనమండలి సభ్యులు పోచం రెడ్డి సుబ్బారెడ్డి, శాంతి నికేతన్ హై స్కూల్ యజమాని ఇలియాస్ రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, అరుణ కుమారి, స్వర్ణ సీతా రామ సుబ్బయ్యలను ఘనంగా సన్మానించారు. పోచం రెడ్డి సుబ్బారెడ్డి, ఇలియాస్ రెడ్డి స్పందిస్తూ అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో పలు పాత్రలు పోషించామని, ఈరోజు నాటక రంగ దినోత్సవ సందర్భంగా ఈ సన్మానం పొందడం సంతోషంగా ఉందన్నారు. వెల్లాల వెంకటే శ్వరాచారి మాట్లాడుతూ సత్య హరిశ్చంద్రుడు, శ్రీకృష్ణుడు వంటి మహోన్నత వ్యక్తిత్వాలు కలిగిన పాత్రలను పోషించడం నా పూర్వ జన్మ సుకృతమన్నారు. అరుణ కుమారి ప్రసంగిస్తూ 12 సంవత్సరాల వయస్సులోనే ద్రౌపది పాత్రను పోషించానని గరుడ, నంది బహుమతులు అందుకున్నాన న్నారు. రామసుబ్బయ్య మాట్లాడుతూ నా జీవితాన్ని నాటకరంగానికి అంకితం చేశాననే ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పాలెం వేణుగోపాల్,దాసరిసుధాకర్, క్రాంతి కుమార్‌పాల్గొని ప్రసంగించారు.

## మిట్స్ వర్సిటీ నోడల్ సెంటర్‌గా గుర్తింపు

### - వైస్ ఛాన్సలర్



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) ఏఐసిటిఈ, న్యూ ఢిల్లీ వారు (సార్వత్రిక మానవ విలువలు) కోసం నోడల్ సెంటర్‌గా గుర్తింపు లభించిందని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలియ జేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విలువల ఆధారిత విద్యా విధానం, సమాజ సేవా దృక్పథం పెంపొందించడం వంటి అంశాల్లో మిట్స్ చూపుతున్న నిరంతర కృషిని గుర్తించి గౌరవ గుర్తింపు ధ్రువ పత్రం అంద జేశారు. సార్వత్రిక మానవ విలువలను విద్యా వ్యవస్థలో సమన్వయం చేయడం, ఇతర విద్యాసంస్థలకు కూడా ఈ విలువలను విస్తరించడం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలపట్ల విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహించడం వంటి అంశాలు ఈ గుర్తింపుకు కారణ మయ్యాయి. భవిష్యత్తులో మానవ విలువలను పెంపొందించే విద్యను మరింత బలోపేతం చేస్తామని, విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చి దిద్దడంలో మిట్స్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ యెన్.ద్వార కానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ యూ.హెచ్.వి సెల్ మెంబెర్స్, అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి యువరాజ్, యూనివర్సిటీ యూ.హెచ్.వి సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి జగదీశ్ బాబు, కో కోఆర్డినేటర్ డాక్టర్ కే చంద్ర మోహన్ పాల్గొన్నారు.

## 19న తిరుపతిలో జరగాల్సిన బీసీల ఆత్మీయ సదస్సు వాయిదా

### - బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం




**మదనపల్లె, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల19న తిరుపతి లో నిర్వహించ తలపెట్టిన బీసీల ఆత్మీయ సదస్సును తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలోని ది- మదనపల్లె ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.షణ్ముగం మాట్లాడుతూ 16, 17, 18 తేదీలలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో, బీసీ నేతలు తప్పక హాజరు కావలసిన తరుణంలో ఈ సదస్సు వాయిదా వేయడం జరిగిందని, త్వరలోనే సదస్సు నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు. జనాభాలో 60 శాతంపైగా ఉన్న వెనుక బడిన వర్గాల జనాభా లెక్కల తీయకపోవడం శోచనీయమన్నారు. ఎన్నో పర్యాయలు ఢిల్లీలో నిరసనలు, సెమినార్లు నిర్వహించి ఎంతో మంది ప్రధాన మంత్రులకు విన్నవించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మే 1, తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణలో బీసీల జనాభా లెక్కలు సేకరించాలని, చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు 33.3 శాతం బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు.కేంద్రం లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించా లన్నారు.బీసీల దీర్ఘకాలిక సమస్యలను కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పెద్దన్న పాత్ర పోషించి న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**మహాత్మ జ్యోతిబాపూలే**

ద్విశతాబ్ది వేడుకల కమిటీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యని సభ్యుడిగా నియమించ డానికి స్వాగతిస్తున్నా మన్నారు. ఇందులో భాగంగా జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ఎంపికైన చామంచుల మల్లిక, ఏపి రజక అభివృద్ధి సంఘం వర్కింగ్ చైర్మన్ నాగయ్య, మహిళా ప్రధాన కార్యదర్శి గా వనజ, రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్ వల్లి, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా జె.శంకర్, జిల్లా అధికార ప్రతినిధిగా కలిశం ప్రకాష్ నాయుడు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## లే అవుట్లలో ఎంపిడిఓ విస్తృత తనిఖీ



**మదనపల్లె,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని పలు పంచాయితీల లోని లే అవుట్లను ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అధికారులు, ఆయా పంచాయితీల సెక్రటరీలతో కలిసి గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సిటియం పంచాయితీలో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్ ను గుర్తించారు. అక్కడ అనధికార లే అవుట్ అని బోర్డు నాటారు. పికెఎంఉడా అనుమతుల మేరకే లేఅవుట్లు ఏర్పాటు చేయాలని, అన్ని అనుమతులు ఉన్న లే అవుట్లలోనే క్రయ విక్రయాలు చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు. దుబ్బిగానిపల్లి పంచాయితీలో ఏర్పాటు చేసిన పికెఎంఉడా అప్రూవుడ్ లే అవుట్ ఆవాస గార్డెన్స్ సందర్శించి 10 శాతం లే టవుట్ సామాజిక ప్రయోజనాలకు కేటాయించి పంచాయితీ పేరున రిజిస్ట్రేషన్ చేయాలని నిర్వాహకులకు తెలిపారు. కొత్తవారిపల్లి పంచాయతీ, ఓబుల్ రెడ్డి వారిపల్లి దగ్గర గల పికెఎంఉడా అనుమతి ఉన్న లేఔట్‌ను సందర్శించి 10 శాతం ల్యాండ్ ను పంచాయతీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిభందనల మేరకు.. పికెఎంఉడా అనుమతుల మేరకే లే అవుట్లను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో డిప్యూటీ ఎంపిడీఓ భారతి, సెక్రటరీ పవన్, రవీంద్ర, కార్యదర్శులు మని, పుష్ప ఉన్నారు.

## అసర్ల గంగమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



**గాలివీడు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసర్ల గంగమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం. రాయచోటి నియోజకవర్గం, గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామం నల్లగుట్ట లో వెలసిన అసర్ల గంగమ్మ తల్లి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాంత్ రెడ్డి, రమేష్‌రెడ్డి స్థానిక ప్రజలు, కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికి, పూజాది కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో సి జి ఎఫ్ నిధుల ద్వారా గాలివీడులో రామాలయ రాజగోపురం, ప్రహరీ నిర్మాణానికి, పందికుంటలో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి, గోరాన్ చెరువులో శ్రీ అసర్ల గంగమ్మ ఆలయ నిర్మాణాలకు నిధులు, టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 12 ఆలయాలకు నిధులు మంజూరు చేయించామన్నారు. రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలు నాగరికత కు ప్రతీకలన్నారు. అసర్ల గంగమ్మ తల్లి ఆలయానికి నిధులు మంజూరులో అప్పటి ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కృషి అభినందనీయ మన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, రమేష్ రెడ్డిలను స్థానిక ప్రజలు దుస్సాలువలతో సత్కరించారు.

## వాయిదా పడ్డ టెండర్లు

### - మునిసిపల్ కమిషనర్

**మదనపల్లె, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె పురపాలక సంఘానికి సంబంధించి దినసరి మాంసం మార్కెట్ , ప్రైవేట్ బస్టాండ్ టెండర్ కమ్ అక్షన్ పురపాలక సంఘం చాంబరులో గురువారం నిర్వహించడం జరిగిందని కమిషనర్ ప్రమీల పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ.. సదరు టెండర్ కమ్ అక్షన్ లో ఎవరు పాల్గొనందున వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 25న ఉదయం 11:00 లకు పురపాలక సంఘం చాంబరులో మళ్లీ టెండర్ కమ్ అక్షన్ నిర్వహించనున్నట్లు చెప్పారు.



# అన్నమయ్య జిల్లా

## పాత్రికేయుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యం

### - ఎమ్మెల్యే షాజహాన్ బాషా

### - మదనపల్లె జిల్లా కేంద్రంలో పాత్రికేయుల ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



**మదనపల్లె, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య శ్రేయస్సు దృష్ట్యా మదనపల్లె ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోని డిఇఐసి భవనంలో గురువారం ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వ హించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సహకారంతో వైద్య ఆరోగ్యశాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని సాధారణ వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన పరీక్షలు, వైద్య సేవలు, ల్యాబ్ సౌకర్యాలు, వైద్యుల కేటాయింపు వివరాలను ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ ను అడిగి తెలుసు కున్నారు. ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లో ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నిత్యం ప్రజల కోసం కృషి చేసే పాత్రికేయులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా అందించే పరీక్షలు బయట చేయిస్తే రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చవుతాయని, ప్రభుత్వమే ఉచితంగా అందించడం జర్నలిస్టుల సంక్షేమానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో పరిశుభ్రమైన వాతావరణంలో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఆర్ఎంఓ డాక్టర్ రాధిక, జిల్లా డిసిహెచ్ఎస్ లక్ష్మీ ప్రసాద్, వైద్య బృందం, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతి నిధులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అగ్నిమాపకదళ అవగాహన



**పీలేరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పీలేరు పట్టణంలో అవగాహన కార్యక్రమాలు ఉత్సాహం గా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మూడవ రోజు, పీలేరు టౌన్ తిరుపతి రోడ్‌లో ఉన్న ఎం.ఎన్.ఆర్ తిరుమల అపార్ట్మెంట్స్‌లో నివాసముంటున్న ప్రజలకు ప్రత్యేక అగ్ని ప్రమాద నివారణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి సి. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రజలకు వివిధ రకాల అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీలు, వంట సమయంలో జరిగే అగ్ని ప్రమాదాలు, ఆయిల్ ఫైర్స్, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించి, వాటిని ఎలా నివారించాలో స్పష్టంగా తెలిపారు. ప్రమాదం సంభవించిన సమయంలో గందరగోళానికి గురికాకుండా తక్షణ చర్యలు ఎలా తీసుకోవాలో, అగ్నిని నియంత్రించే ప్రాథమిక పద్ధతులు ఏమిటో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ముఖ్యంగా గ్యాస్ స్టవ్ మంటలు చెలరేగినప్పుడు నీటిని వాడకూడదని, బదులుగా తడి గుడ్డ లేదా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఉపయోగించాల్సిన అవసరాన్ని వివరించారు. అపార్ట్మెంట్‌లలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎస్కేప్ రూట్లు ఎలా ఉపయోగించాలి, ఎలివేటర్‌లకు బదులుగా మెట్లు ఉపయోగించాలి, పిల్లలు , వృద్ధులను ముందుగా సురక్షిత ప్రదేశాలకు తరలించాల్సిన విధానం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఫైర్ ఎస్కేప్ విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ, నివాసితులలో ధైర్యం . అప్రమత్తత పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, ముఖ్య సూచనలను గోడలపై ప్రదర్శించారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. ఇందుకోసం 101, 08584-244399, 9963736587 నంబర్లకు వెంటనే కాల్ చేయాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అప్రమత్తత పెంపొందడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకునే సామర్థ్యం కూడా పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి సి. భాస్కర్ రెడ్డి, లీడింగ్ ఫైర్ మాన్‌లు హేమాద్రి రెడ్డి, ఎస్. చలపతి, పి. అశోక్ కుమార్, డ్రైవర్ ఆపరేటర్లు బి. రాజగోపాల్ నాయక్, కుశవన్, ఫైర్ మాన్‌లు రాజేంద్ర, జాకీర్, చేతన్, ఇమ్రాన్, షఫీతో పాటు అపార్ట్మెంట్ మహిళలు మరియు ఇతర నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సీఐని కలిసిన టిడిపి నాయకులు



**ములకలచెరువు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ములకలచెరువు సర్కిల్ కార్యాలయంలో నూతన సీఐ దస్తగిరిని గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేసి శాలువతో కప్పి సన్మానించారు. సర్కిల్ పరిధిలోని ప్రజలకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలని టిడిపి నాయకులు కోరారు. ఫిర్యాదులను పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తానని సీఐ తెలియజేశారు. గ్రామాలలో అసంఘక కార్యక్రమాలు జరుగుతుంటే వాటి పట్ల ముందస్తుగా పోలీస్ స్టేషన్లో తెలియ జేయాలని కోరారు. సిఐ ని కలిసిన వారిలో సోంపల్లి సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు, తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యదర్శి మాజీ సర్పంచ్ ఎర్రగుడి సురేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కె.వి రమణ, మాజీ వైస్ ఉప ఎంపీపీ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు రవిచంద్ర, చాంద్ భాషా, విజయ్ కుమార్, భజంత్రీ రామానుజులు , శేషారెడ్డి పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



**ములకలచెరువు , ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వినాయక నగర్ లో అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్పిజి గ్యాస్ సిలిండర్లు లీక్ అయినప్పుడు, ఫైర్ అయినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అగ్నిమాపక కేంద్రం ద్వారా ప్రజలకు అందే సహాయం గురించి తెలియజేశారు. కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు స్థానిక అగ్నిమాపక కేంద్రం ల్యాండ్ లైన్ నెంబర్ : 08582-294455 కు మొబైల్: 9963736976, టోల్ ఫ్రీ నెంబర్ 101 కు సమాచారం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కిరణ్ కుమార్ రెడ్డి, అల్లా బక్షు, మల్లికార్జున, చిన్నబాబు, మనోజ్ కుమార్,శశి కుమార్ లు పాల్గొన్నారు.

## ఫోన్ మాట్లాడుతూ.. లోకానికే దూరమై.. లయోలా కళాశాల సమీపంలో విషాదం



**విజయవాడ , ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని లయోలా కళాశాల సమీపంలో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. ఫోన్లో మాట్లాడుతూ అప్రమత్తత కోల్పోయిన ఓ వ్యక్తి.. భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల కథనం ప్రకారం.. సదరు వ్యక్తి తన నివాసంలోని రెండో అంతస్తు బాల్కనీలో ఫోన్ మాట్లాడుతుండగా, ఒక్కసారిగా పట్టుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మిస్సింగ్ కేసుల ఛేదనలో 'సెంట్రల్' మార్క్!

### మాచవరంలో వంద శాతం రికవరీ.. సత్తా చాటిన పోలీసులు



**విజయవాడ , ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ సెంట్రల్ జోన్ పరిధిలో అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ కనుగొనడంలో పోలీసులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను వేగంగా ఛేదిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నమోదైన కేసుల్లో పటమటలో 15 మిస్సింగ్ కేసులకు గాను 12 కేసులను పోలీసులు ట్రేస్ చేశారు.అలాగే గుణదల పరిధిలో 6 కేసుల్లో నాలుగింటిని ఛేదించారు. మరీ ముఖ్యంగా మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొత్తం 25 కేసులను 100 శాతం ఛేదించి, బాధితులను సురక్షితంగా వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. పోలీసుల పనితీరుపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చీమల దండుకు చెక్


### : వంటింటి చిట్కాలతో 'మంగళం' పాడండి!



**విజయవాడ , ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేసవి వచ్చిందంటే చాలు.. ఇంట్లో ఎక్కడ చూసినా చీమల రొద. పంచదార డబ్బా పక్కన పెట్టినా, బెల్లం ముక్క కింద పడినా నిమిషాల్లో ప్రత్యక్షమవుతాయి. వీటిని చంపకుండానే ఇంటి నుండి పారద్రోలడానికి కొన్ని అద్భుతమైన మార్గాలు ఇక్కడ ఉన్నాయి.వెనిగర్ మ్యాజిక్.. చీమలు పరార్!వంటగది మూలల్లో చీమలు చేరుతుంటే సమాన పరిమాణంలో వెనిగర్, నీటిని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసి వాడండి. కిటికీలు, తలుపుల వద్ద ఈ మిశ్రమాన్ని స్ప్రే చేస్తే ఆ ఘాటైన వాసనకు చీమలు చుట్టుపక్కలకు కూడా రావు.నిమ్మరసం.. సువాసనతో పాటు రక్షణ నిమ్మకాయ వాసనను చీమలు అస్సలు భరించలేవు. చీమలు ఎక్కువగా తిరిగే చోట నిమ్మరసం చల్లినా లేదా నిమ్మ తొక్కలు ఉంచినా వాటి ఘాటుకు చీమల 'సెన్సింగ్' దెబ్బతింటుంది. ఇది వంటింటిని తాజాగా కూడా ఉంచుతుంది.మసాలా దినుసుల ఘాటు.. చీమలకు గుండెపోటు!దాల్చిన చెక్క పొడి, లవంగాలు లేదా లవంగం నూనెను చీమలు వచ్చే రంధ్రాల వద్ద ఉంచండి. అలాగే, తీపి పదార్థాల చుట్టూ మిరియాల పొడి చల్లితే, ఆ ఘాటుకు చీమలు వెంటనే తోక ముడుస్తాయి.

## "దత్తత' కు ముందుకు వస్తున్న దంపతులకు అభినందనలు.

### కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్న దంపతులు ఎంతో మందికి ఆదర్శనీయులని, ఏ బిడ్డా అనాథగా మిగిలిపోకూడదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కారా పోర్టల్‌లో దత్తత కొరకు నమోదును చేసుకున్న తల్లిదండ్రులకు శిశుగృహ లో ఆశ్రయం పొందిన ఒక బిడ్డను దత్తత ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎం.ఎన్. రాణి, ఈ.ఓ విజయలక్ష్మి,డిసిపిఓ కిషోర్,ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంతి, తదితరులు పాల్గొ నారు.

## ప్రశాంతంగా ముగిసిన "పది" పరీక్షల మూల్యాంకనం



**మచిలీపట్నం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈనెల 5వ తేదీ నుండి 15వ తేదీ వరకు పదవ తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కృష్ణా జిల్లా డిఈఓ యు .వి. సుబ్బారావు ఆధ్వర్యంలో పరీక్షల మూల్యాంకనం నిర్వహించారు. ఈసారి వినూత్నంగా టాప్ సిస్టంతో మార్కులను నమోదు చేశారు. 76 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 449 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 228 మంది స్పెషల్ అసిస్టెంట్లు మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్నట్లు కృష్ణాజిల్లా డీఈవో సుబ్బారావు తెలిపారు. మొత్తం 753 మంది స్థానిక గవర్నమెంట్ లేడీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 1,84,270 పేపర్లను మూల్యాంకనం చేశారని డీఈవో తెలిపారు. మూల్యాంకనం పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు డీఈవో తెలిపారు. మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్న వారికి ఒక్కొక్క పేపర్ దిద్దినందుకు 10 రూపాయలు, స్పెషల్ అసిస్టెంట్ కి రోజుకు 300 రూపాయలు చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. 8 కిలోమీటర్ల పరిధి దాటి మూల్యాంకన విధులకు హాజరయ్యే వారికి టీఏడీఏలు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. మూల్యాంకన ఉనికి సంబంధించిన నిధులను సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందన్నారు.

## మంగినపూడి బీచ్ వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు




**మచిలీపట్నం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. తాలూకా ఎస్సై ఆధ్వర్యంలో జరిగిన ఈస్పెషల్ డ్రైవ్‌లో ప్రతి వాహనాన్ని ఆపి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలను సమగ్రంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. రోడ్డు భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. అలాగే బీచ్ ప్రాంతంలో సాయంత్రం తర్వాత అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పహారా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతూ కఠిన చర్యలు చేపడుతున్నారు.

## కృష్ణా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్మీడియట్ విద్యార్థులు



**మచిలీపట్నం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణాజిల్లాలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాల విద్యార్థులు ఇంటర్మీడియట్ -- 2026 ఫలితాలలో అద్భుత విజయాలు సాధించారు. జూనియర్ ఇంటర్మీడియట్ (మొదటి సంవత్సరం) ఫలితాలలో జిల్లావ్యాప్తంగా మొత్తం విద్యార్థులు 133 మంది హాజరయ్యారు. వీరిలో 116 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 87% గా నమోదు చేసుకున్నారు. జూనియర్ ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఎంపీసీ విభాగంలో చాముండేశ్వరి కుసుమ -- 460/470 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, అవనిగడ్డ). ఏ ఎన్ పి విభాగంలో ఎస్. మిరియం -- 480/500 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, మచిలీపట్నం). ఎం.ఎల్.టి: బి. వర్షిని -- 474/500 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, మచిలీపట్నం). ఫస్ట్ ఇయర్‌లో 20 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్మీడియట్ ( ద్వితీయ సంవత్సరం) ఫలితాలు మొత్తం హాజరైన విద్యార్థులు 111 మంది హాజరవ్వగా వీరిలో 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు మొత్తం ఉత్తీర్ణత శాతం 90% గా నమోదు చేసుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వివరాలు ఎం పి హెచ్ డబ్ల్యు: ఎల్. షైనీ -- 963/1000 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, గుడివాడ). ఎం ఎల్ టి విభాగంలో బి ఈశ్వరి నాగజ్యోతి -- 962/1000 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, మచిలీపట్నం).ఎం ఎల్ టి లో చంద్రిక -- 958/1000 మార్కులు (ఎస్సీ బాలికల వసతి గృహం, గుడివాడ). సెకండ్ ఇయర్‌లో 25 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఈ అద్భుత ఫలితాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాల్లో అమలు చేస్తున్న నాణ్యమైన బోధన, ప్రత్యేక శిక్షణ అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనం అని , ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కె షాహిద్ బాబు విద్యార్థులను, ఉపాధ్యాయులను, హాస్టల్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## ఒంటిమిట్ట కోదండరాముడి హుండీ ఆదాయం రూ.29,00,205



**ఒంటిమిట్ట ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. రూ. 29,00,205 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి నవీన్ కుమార్ తెలిపారు. ఆలయంలోని రంగ, ముఖ మండపం, భక్త సంజీవరాయ స్వామి ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించారు. తితిదే పరిపాలన, విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణలో శ్రీవారి సేవకులు లెక్కింపు చేపట్టారు. మార్చి 26 నుంచి ఈ నెల 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. రాములోరి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆరాధ్య దైవం జగదభిరాముడిని దర్శించిన అనంతరం భక్తులు హుండీల్లో కానుకలను వేశారు. నెల రోజుల వ్యవధిలో ఆలయానికి రూ. 29 లక్షలు ఆదాయం రావడం గత పదేళ్ల కాలంలో ఇదే తొలిసారి అని ఆలయ అధికారులు తెలిపారు.

## సర్వాయపాలెం ఉన్నత పాఠశాలలో 'మనబడి.. జ్ఞాన బాట' ర్యాలీ




**కావలి ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కావలి మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ప్రధానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను నూతన విద్యార్థుల చేరికలను ప్రోత్సహిస్తూ 'మనబడి.. జ్ఞాన బాట' ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలోని పాఠశాలకు, ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి.. ప్రతి చిన్నారిని ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని నిపుణులైన ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు మంచి పునాదిని వేస్తాయన్నారు. పాఠశాలలో అత్యాధునిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని, 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను సర్వాయపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతుల్ని కృషి విజ్ఞాన కేంద్రానికి తీసుకు వెళ్లిన జిల్లా వ్యవసాయ శాఖ




**మచిలీపట్నం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం వ్యవసాయ సబ్ డివిజన్ మండలాలు అయిన పెడన గూడూరు మచిలీపట్నం మండలాల నుండి రైతులను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పరిశోధనా స్థానం ఘంటసాలకు మినీ బస్సులో తీసుకుని వెళ్లారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమాదేవి పెడన,గూడూరు మచిలీపట్నం మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు ఈ ఎక్స్ పోజర్ విజిట్ కు హాజరవడం జరిగింది. మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. కుంచె నాని మాట్లాడుతూ, ప్రభుత్వం అభ్యుదయ రైతులందరిని ఎంపిక చేసి వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను పరిచయం చేయుటకు ఎల్లవేళలా సుముఖంగా ఉంటుందని తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో స్వల్ప పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని పొందుటకు నూతన మార్గాలను అన్వేషించాలన్నారు .శాస్త్రవేత్తల సలహాలను తప్పకుండా పాటించాలన్నారు.రసాయనిక ఎరువుల వినియోగం బాగా తగ్గించాలని,ఈ యాత్రలో పాల్గొనే రైతులందరినీ ప్రోత్సహించే ఈ కార్యక్రమం బాగా జరగాలని కోరుకుంటున్నాను.

## విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు.. డీఎస్పీ సుధాకర్



**నరసాపురం ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**నరసాపురం మండలం, సీతారాంపురం సౌత్ గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజీ వద్ద ఈ నెల 13వ తేదీన జరిగిన ర్యాలీపై కొందరు వ్యక్తులు ఇన్స్టాగ్రామ్‌లో అభ్యంతరకరమైన పోస్టులు, వ్యాఖ్యలు చేశారని డీఎస్పీ సుధాకర్ తెలిపారు. వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్న ఈ చర్యలపై మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో Cr No. 70/2026 U/s 196(1)(a), R/w 3(5) BNS, SC, ST (POA) Act-2015, IT Act-2000 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

### 8 మంది మృతి, 13 మందికి గాయాలు



**ఎమ్మిగనూరు ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## నందిగామ సబ్ డివిజన్ ఏసీపీగా చలమాల శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం...

**నందిగామ ఏప్రిల్ 16( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ సబ్



డివిజన్‌కు కొత్త ఏసీపీగా నియమితులైన చలమాల శ్రీనివాసరావు బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని తమ శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నందిగామ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకుండా అహర్నిశలు శ్రమిస్తామని, ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని అన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, నేరాల నివారణలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు ఎప్పుడూ అండగా నిలుస్తానని, న్యాయపరమైన సేవలను పారదర్శకంగా అందిస్తానని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అధికారులు, సిబ్బందితో ఆయన చర్చించి, భవిష్యత్తు కార్యాచరణపై మార్గదర్శకాలు ఇచ్చారు.




# 'సంభవం'... క్రేజీ ఐడియా ఇది



గత కొన్నేళ్లలో మలయాళ దర్శకులు బాగా డెవలప్ అయ్యారు. క్రైమ్, హారర్, సస్పెన్స్ ఈ మూడు అంశాలను తీసుకుని వాటికి పోలీస్ ఆఫీసర్ల బ్యాక్ డ్రాప్ జోడించి చాలా సినిమాలు తీశారు. వాటిలో అత్యధిక శాతం హిట్టయినవే. మనోళ్లు కూడా ఓటిటిలో డబ్బింగ్ రూపంలో చూసి ఆహా ఓహో అన్నవాళ్ళే. ఈ సిరీస్ లో ఒక కొత్త మూవీ వచ్చింది. దాని పేరు సంభవం అధ్యాయం ఒన్ను. నేరుగా హాట్ స్టార్ లో రిలీజైన ఈ మూవీకి సోషల్ మీడియాలో చాలా సపోర్ట్ దక్కుతోంది. ఎందుకో చూద్దాం. అసలీ స్టోరీ పాయింటే క్రేజీగా ఉంటుంది. కేరళ ఆంధ్ర సరిహద్దులో ఉండే ఒక అటవీ ప్రాంతానికి ట్రాన్స్ ఫర్ మీద వెళ్తాడు ఆనంద్. దారిలో ఒక యాక్సిడెంట్ కనిపించి గాయపడిన మరో పోలీసును ఆసుపత్రిలో చేరుస్తాడు. డ్యూటీ చేరే సమయంలో అడవిలో జరిగిన ఒక దాడి గురించి తెలిసి మరో ఇద్దరు ఆఫీసర్లతో కలిసి అక్కడికి చేరుకుంటాడు. కానీ లోపలికి వెళ్లే కొద్దీ ముప్పై సంవత్సరాల వెనుకటి సంఘటనలు, మనుషులు ఎదురవుతారు. అసలు ట్విస్టులు మొదలవుతాయి. కథని ఇక్కడ చిన్నగా చెప్పినప్పటికీ అసలు కంటెంట్ లో బోలెడు ట్విస్టులు పెట్టారు. టైం లూప్ కాన్సెప్ట్ కొత్తది కాకపోయినా దాన్ని ఒక అడవికి ముడిపెట్టి, కాకి తలతో ఉన్న మనిషి విగ్రహానికి హారర్ ఎలిమెంట్ జోడించి దర్శకుడు జీతూ సతీషన్ మంగళతు కొత్త అనుభూతి కలిగిస్తాడు. ముఖ్యంగా మొదటి అరగంట కాస్త ఓపిగ్గా చూడగలిగితే ఆ తర్వాత స్క్రీన్ ప్లే పరుగులు పెడుతుంది. ముఖ్యంగా సెకండాఫ్ లో వచ్చే మలుపులను ఈజీగా గెస్ చేయలేనంత టిపికల్ గా ఉంటాయి. తెలుగు ఆడియోతో పాటు అందుబాటులో ఉన్న సంభవం అధ్యాయం ఒన్ను ఈ జానర్ సినీ ప్రియులను ఖచ్చితంగా ఆకట్టుకుంటుంది. కాకపోతే మల్లువుడ్ స్టైల్ స్లో నెరేషన్ ఇందులోనూ ఉంటుంది. ఆ తరహా కథనం అలవాటు లేకపోతే కొంచెం ల్యాగ్ అనిపిస్తుంది. ఇది మొదటి భాగమే. పార్ట్ 2కి ముఖ్యమైన లీడ్ ఇచ్చి ఆసక్తి పెంచారు. సినిమా చూశాక కలిగే సందేహం ఒకటే. ఇంత క్రేజీ ఐడియాలు మలయాళీ మేకర్స్ కి ఎలా వస్తాయో. ఇలాంటివి థియేటర్ కన్నా డిజిటల్ లోనే బాగా ఆడతాయి.

# ప్రతాప్ కష్టాలు పగవాడికి కూడా వద్దు



రేపు విడుదల కాబోతున్న పాపం ప్రతాప్ కు టైటిల్ కు తగ్గట్టే చివరి నిమిషం వరకు అయ్యో పాపం అనిపించే పరిణామాలే జరుగుతున్నాయి. చివరి నిమిషంలో సెన్సార్ చిక్కు ఒకటి వచ్చి పడటంతో నిర్మాతలు ఆఘమేఘాల మీద పరుగులు పెడుతున్నారు. సినిమాలో ఎలాంటి జంతువులను వాడలేదని అనిమల్ వెల్ఫేర్ బోర్డు నుంచి ఒక సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. కానీ ఎక్కడో పొరపాటు జరగడంతో దాన్ని మర్చిపోయారు. అది సబ్మిట్ చేస్తే తప్ప సెన్సార్ క్లియరెన్స్ రాదు. కథకు సంబంధించిన ఒక ముఖ్యమైన ట్విస్టు జంతువు మీదే ఉంటుందట. నిన్న సోషల్ మీడియాలో ఈ లీకు తెగ చక్కర్లు కొట్టింది. పగలు మనిషిగా రాత్రి మృగంగా మారిపోయే జంతువు పాయింట్ అంటూ తెగ ఊదరగొట్టారు. ఇది పాపం ప్రతాప్ అనే క్లారిటీ వచ్చేసినట్టే. ఈ లెక్కన హైదరాబాద్ లో ప్లాన్ చేసిన నైట్ ప్రీమియర్లు దాదాపుగా లేనట్టే. ఒకవేళ ఆ టైంకి సమస్య పరిష్కారం కాకపోతే రేపు ఉదయం షోలు లేట్ కావొచ్చు. దీనికొకటే కాదు గతంలో దండోరా కూడా ఇలాంటి ప్రాబ్లమ్ ఫేస్ చేసింది. అప్పుడు ప్రొడ్యూసర్లు పడిన టెన్షన్ అంతా ఇంతా కాదు. ఎట్టకేలకు సెన్సార్ తెచ్చుకుని సమయానికి షోలు వేయగలిగారు. కానీ అప్పుడు వచ్చిన ఇష్యూ జంతువులది కాదు. కొన్ని సన్నివేశాల పట్ల అభ్యంతరం వచ్చింది. అది అంతర్గతంగా సెట్ చేసుకునేది కాబట్టి టైంకి సాల్వ్ అయ్యింది. కానీ పాపం ప్రతాప్ ఇప్పుడు బయటి నుంచి నో యానిమల్ పత్రం తీసుకురావాలి. ఏది ఏమైనా ఇకపై నిర్మాతలు ఇలాంటి విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కనీసం వారం ముందే ఇలాంటి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యేలా చూసుకోవాలి. లేకపోతే డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఎగ్జిబిటర్ల దాకా అందరూ ఇబ్బంది పడతారు. తిమ్మరాజుపల్లి టీవీ, బ్యాడ్ బాయ్ కార్తీక్, పల్లిచట్టంబితో పోటీ పడుతున్న పాపం ప్రతాప్ కు అన్నీ సానుభూతులే దక్కుతున్నాయి. ఇదంతా ఎలా ఉన్నా కనీసం థియేటర్లలో సూపర్ అయితే తిరువీర్ కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది.

# మృణాల్‌తో సినిమా చేస్తే హీరో జైటేనా?



సినిమాల్లో పాత్రలను కొంతమంది నిజ జీవితంలో కూడా ఎంతో ఓన్ చేసుకుంటారు. తెరపై వారికి అన్యాయం జరిగితే నిజంగానే వారికేదో నష్టం జరిగినంత ఫీలవుతారు. అలాంటి ప్రభావం చూపగలిగే పాత్రలు చాలా గొప్పవి. బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ తెలుగులో అలాంటి పాత్రే చేసింది 'సీతారామం' చిత్రంలో. రామ్ కోసం ఆ సినిమాలో సీత పడే తపనకు ప్రేక్షకులు ఎంతగానో కదిలిపోయారు. రామ్‌ను కోల్పోయిన సీతను చూసి చివర్లో హృదయం ద్రవించి పోతుంది. తన వల్లే ఆ సినిమాలో సీతకు రామ్ దూరమయ్యాడని ఆ చిత్రంలో విష్ణు శర్మ పాత్రను పోషించిన సుమంత్.. మృణాల్‌కు సారీ చెప్పిన సంగతి తెలిసిందే. ఐతే మృణాల్.. ఇలా తన సినిమాల్లో భర్తను కోల్పోయే పాత్ర చేయడం 'సీతారామం'కే పరిమితం కాదు. అంతకుముందు హిందీ 'జెర్సీ'లోనూ ( హిందీ ) అలాంటి క్యారెక్టరే చేసింది. ఇప్పుడు మృణాల్ నుంచి వచ్చిన 'డెకాయిట్'లోనూ చివరికి తన లవర్‌ను కోల్పోతుంది. ఇలా కెరీర్లో ఎక్కువగా భర్త లేదా లవర్‌ను కోల్పోయే పాత్రలు చేస్తున్న నేపథ్యంలో.. తన ఫ్రెండు ఒకరు తనకు 'హజ్బెండ్ మర్డరర్' అనే పేరు పెట్టినట్లు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది మృణాల్ ఠాకూర్. ఇలాంటి పాత్రలు ఎక్కువ అయిపోతున్న నేపథ్యంలో ఇకపై కొంచెం జాగ్రత్త పడాలేమో అన్నట్లు ఆమె వ్యాఖ్యానించింది. మరోవైపు 'సన్నాఫ్ సర్దార్-2' చిత్రంలో తనకు భర్తగా పెద్ద వయస్కుడైన చంకీ పాండేను పెట్టడం తనకు నచ్చలేదని వ్యాఖ్యానించింది మృణాల్. ఈ సినిమాలో కొన్ని ముఖ్యమైన ఎమోషనల్ సీన్లు ఎడిటింగ్‌లో లేపేయడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సినిమా సరిగా ఆడకపోవడానికి ఇవే కారణాలన్నట్లు ఆమె మాట్లాడింది. తనకు ప్రేమించేంత ఖాళీ లేదని.. ఇప్పుడే పెళ్లి కూడా చేసుకోబోనని ఆమె ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేసింది ఈ మరాఠీ అమ్మాయి.

# పెద్ది... డేట్ ఎందుకు చెప్పలేదు?



అనుకున్నదే అయింది. 'పెద్ది' సినిమా వాయిదా పడింది. ఈ విషయాన్ని ఈ రోజు అధికారికంగా ప్రకటించేశారు. ఐతే మార్చి నెలాఖరు నుంచి వాయిదా వేసినపుడు ఏప్రిల్ 30న రిలీజ్ అంటూ కొత్త డేట్ స్పష్టంగా చెప్పిన చిత్ర బృందం.. ఈసారి మాత్రం ఆ పని చేయలేదు. ఇప్పటికే రెండుసార్లు డేట్ మార్చుకున్న నేపథ్యంలో ఇంకోసారి డేట్ చెప్పి.. అటు ఇటు అయితే జనాల్లో పూర్తిగా క్రెడిబిలిటీ కోల్పోతామన్న భయం కావచ్చు.

జూన్ నెలలో ఇంకో భారీ పాన్ ఇండియా సినిమా అయిన 'టాక్సిక్' రావాల్సి ఉంది. ఆ సినిమా విడుదల తేదీని అనుసరించే 'పెద్ది'కి డేట్ ఫిక్స్ చేయాలని అనుకుంటున్నారు. టాక్సిక్‌ను మార్చి 19 నుంచి వాయిదా వేసినపుడు.. కొత్త రిలీజ్ డేట్ జూన్ 4గా ప్రకటించారు. కానీ ఆ డేట్‌కు పక్కాగా సినిమా వస్తుందా అనే విషయంలో సందేహాలున్నాయి. 'టాక్సిక్' చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసిన కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థే.. విజయ్ చిత్రం 'జననాయగన్'ను కూడా నిర్మించింది. ఆ సినిమా అనివార్య కారణాలతో వాయిదా పడ్డ సంగతి తెలిసిందే. దాని రిలీజ్ విషయంలో చాలా చిక్కుముడులు ఉన్నాయి. వాటన్నింటినీ పరిష్కరించుకుని ఏ తేదీన రిలీజ్ చేస్తారు అన్నదాన్ని బట్టే 'టాక్సిక్' విడుదల కూడా ఆధారపడి ఉంది. కాబట్టి ఈ రెండు చిత్రాల వ్యవహారం ఒక కొలిక్కి వస్తేనే.. 'పెద్ది'ని ఎప్పుడు రిలీజ్ చేయాలన్నది నిర్ణయం అవుతుంది. అందుకే ప్రస్తుతానికి జూన్ రిలీజ్ అని మాత్రమే చెప్పారు. ఈసారి డేట్ చెబితే పక్కాగా ఆ తేదీకి రావాల్సిందే కాబట్టి.. ఎందుకైనా మంచిదని ఆచితూచి వ్యవహరిస్తోంది చిత్ర బృందం. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వి కపూర్ నటిస్తోంది. శివరాజ్ కుమార్, జగపతిబాబు ముఖ్య పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు ఛాయాగ్రహణం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీస్ సంస్థతో కలిసి వృద్ధి సినిమాస్,

# బిజినెస్ న్యూస్




## లాభాల్లో ప్రారంభమై నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. యుద్ధం త్వరలో ముగియొచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా బ్యాంక్, ఆటోషేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. అమెరికా-ఇరాన్ చర్చల పురోగతిపై ఉన్న అనిశ్చితి కూడా ప్రభావం చూపింది. సెనట?స్క్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెయ్యి పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ ఉదయం 78,677.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,111.24) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,730.32 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత యూటర్న్ తీసుకున్న సూచీ.. 77,674.93 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 122.56 పాయింట్ల నష్టంతో 77,988.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 34.55 పాయింట్ల నష్టంతో 24,196.75 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఇన్ఫోసిస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4808 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ధరలు పెంచిన HUL.. లిరిల్, డవ్, పియర్స్ సబ్బులు ప్రియం





ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సబ్బుల ధరలను పెంచేసింది. ముడి సరకు ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో ధరల పెంపు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా లిరిల్, పియర్స్, డవ్ వంటి సబ్బుల ధరలు 100 గ్రాములకు రూ.2-3 చొప్పున పెరిగాయి. అంటే సుమారు 3-5 శాతం పెరుగుదల కనిపించింది. తాజా ధరల సవరణతో లిరిల్ 100 గ్రాముల బార్ రూ.41కు చేరింది. పియర్స్ రూ.42, డవ్ సీరమ్ సోప్ రూ.60, డవ్ పింక్ సోప్ రూ.70కి పెంచింది. సబ్బులతో పాటు సర్ఫ్, రెడ్ లేబుల్ వంటి ఇతర ఉత్పత్తులూ ఈ జాబితాలో ఉన్నాయి. గతేడాది జీఎస్టీ రేట్ల సవరణతో ఉత్పత్తుల ధరలు తగ్గించిన హెచ్‌యూఎల్.. ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరలను పెంచేసింది. ముఖ్యంగా సబ్బుల తయారీలో కీలక ముడి పదార్థమైన పామ్ ఫ్యాటీ యాసిడ్ డిస్టిలేట్ (గ్రాఖీూణ) ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హెచ్‌యూఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. సరఫరా కొరత, పామాయిల్ ధరల్లో ఒడుదొడుకుల కారణంగా ఇటీవల కాలంలో పీఎఫ్ఏడీ ధరలు విపరీతంగా పెరిగాయి. అదే సమయంలో పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు రసాయన ముడి పదార్థాల ధరలు పెరిగాయి. దీనికితోడు సప్లయ్ చైన్ అంతరాయాలు, రవాణా ఖర్చులు, ఇంధన ఖర్చులు కూడా పెరిగాయని హెచ్‌యూఎల్ పేర్కొంది. కమొడిటీ ధరలు, క్రూడ్, పామాయిల్, ప్లాస్టిక్ ధరల పెరుగుదలతో ఎంపిక చేసిన ఉత్పత్తుల ధరలు పెంచామని, వినియోగదారులపై అధిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు హెచ్‌యూఎల్ ప్రతినిధి పేర్కొన్నారు.

## 19% ప్రీమియంతో విప్రో రూ.15 వేల కోట్ల బైబ్యాక్




: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.15 వేల కోట్లతో షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం నాటి స్టాక్ క్లోజింగ్ ధరతో (రూ.210) పోలిస్తే ఇది 19 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం 60 కోట్ల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కంపెనీ పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి ఇది సమానమని, రూ.15 వేల కోట్లు మించకుండా బైబ్యాక్ చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. టెండర్ రూట్‌లో ఈ బైబ్యాక్ చేపట్టనున్నట్లు విప్రో తెలిపింది. రికార్డు తేదీ నాటికి విప్రో షేర్లు కలిగిన వాటాదారులు ఈ బైబ్యాక్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని పేర్కొంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూపు సభ్యులు ప్రతిపాదిత బైబ్యాక్‌లో పాల్గొనేందుకు సంకేతాలు ఇచ్చారని తెలిపింది. రికార్డు తేదీ వివరాలను త్వరలో వెల్లడిస్తామంది. 2019లో రూ.10,500 కోట్లు, 2020 నవంబరులో రూ.9,500 కోట్లు, 2023లో రూ.12వేల కోట్లతో విప్రో బైబ్యాక్ చేపట్టింది. తాజా బైబ్యాక్ విప్రో చరిత్రలో భారీ బైబ్యాక్‌గా నిలవనుంది. మరోవైపు విప్రో తన త్రైమాసిక ఫలితాలను కూడా గురువారం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 2 శాతం క్షీణించి రూ.3502 కోట్లకు పరిమితమైంది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలపాల ద్వారా వచ్చే ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.24,236 కోట్లుగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోల్చినప్పుడు విప్రో లాభంలో 12 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం.

## బిందీ-తిలకం' అది పాత సర్క్యులర్.. స్పందించిన సీఈఓ



తన సిబ్బంది మతపరమైన గుర్తులు ధరించవద్దని ప్రముఖ కళ్లజోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ ఆదేశించిందంటూ ఒక సర్క్యులర్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. అది తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూష్ బన్సల్ (గ్రావఎబంప్త్ర దీుఖఅయిత్రీ) స్పష్టత ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? లెన్స్‌కార్ట్ సిబ్బంది స్టైల్ గైడ్ అంటూ నెట్టింట్లో కొన్ని పాయింట్లు వైరల్ అయ్యాయి. వాటి ప్రకారం.. తన స్టోర్లలో సిబ్బంది నలుపు రంగు హెడ్‌స్కార్ఫ్, నలుపు తలపాగాలు ధరించడానికి అనుమతి ఉంది. తిలకం, బిందీ పెట్టుకోవడానికి మాత్రం అనుమతి లేదు. ఈ పాయింట్లు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మతపరమైన పక్షపాతం చూపిస్తున్నారంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంపై బన్సల్ ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు. "లెన్స్‌కార్ట్‌కు సంబంధించి ఒక అసత్యప్రచారం జరుగుతోంది. బిందీ, తిలకం సహా ఎలాంటి మతపరమైన వ్యక్తీకరణలపైన కూడా మా సంస్థలో ఆంక్షలు లేవు. మేం ఎప్పటికప్పుడు మా మార్గదర్శకాలను సమీక్షిస్తూనే ఉంటాం. పాత విధానాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించవు. ఈ గందరగోళం పట్ల క్షమాపణలు కోరుతున్నాం" అని ఒక ప్రకటన విడుదల చేశారు.

# జిల్లా స్థాయి శాప్ లీగ్ పోటీలు

**- 23న ఫుట్ బాల్, - 24న బాక్సింగ్**

**తిరుపతి,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 23న ఫుట్బాల్ , 24న బాక్సింగ్ జిల్లా స్థాయి బాలురు , బాలికల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల ద్వారా రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.శశిధర్ తెలిపారు. శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫుట్బాల్ టోర్నమెంట్–కమ్–సెలక్షన్స్ నిర్వహించబడతాయని, ఇందులో జూనియర్ అండర్–15, యువత అండర్–21 విభాగాల్లో, బాక్సింగ్ పోటీలలో అండర్–15, అండర్–19 విభాగాల్లో పాల్గొనవచ్చునన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఫుట్బాల్ విభాగంలో ఈ నెల 28 నుండి 30 ఏప్రిల్ 2026 వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని. బాక్సింగ్‌లో ఎంపికైన వారు విశాఖపట్నంలో నిర్వహించబడే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని శశిధర్ పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫుట్బాల్‌కు సంబంధించి వినోద్ మొబైల్ నెం.8919295921 , బాక్సింగ్‌కు సంబంధించి సురేంద్ర మొబైల్ నం.9849159147 ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు, జిల్లా స్థాయి టోర్నమెంట్–కమ్–సెలక్షన్స్‌లో పాల్గొనదలచిన వారు శాప్ క్రీడా యాప్‌లో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే, సంబంధిత రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ నేరుగా మొబైల్‌లో ఓపెన్ అవుతుందని దీని ద్వారా ప్లేయర్లు చాలా సులభంగా , వేగంగా తమ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చునని శశిధర్ తెలిపారు.

# స్వీయగణనతో స్పష్టమైన సమాచారం నమోదు చేయవచ్చు

**-కమిషనర్ ఎన్. మౌర్య**



**తిరుపతి,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనన గణన–2027 లో స్వీయగణన (సెల్ఫ్ ఎన్‌రోల్‌మెంట్) చేసుకోవడం వలన స్పష్టమైన సమాచారాన్ని మీరే స్వయంగా ఆన్లైన్ నమోదు చేసుకోవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు తెలిపారు. గురువారం స్వీయగణన విధానాన్ని కమిషనర్ వివరించారు. జనన గణన –2027 ను ప్రభుత్వం పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు స్వీయ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,మే 1వ తేదీ నుండి 30 వ తేదీ వరకు జనన గణన ను ఎన్యుమరేటర్లు నిర్వహిస్తారని తెలిపారు. se.census.gov.in ద్వారా స్వీయ గణనను సులభంగా చేయవచ్చునని తెలిపారు. వివరాలు నమోదు చేసిన తరువాత వచ్చే ఒక యూనిక్ కోడ్ స్క్రీన్ షాట్ తీసుకోవాలని, మే నెలలో మీ వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు కోడ్ చూపితే జననగణన సులభతరం అవుతుందని కమిషనర్ తెలిపారు. జననగణన నిర్వహణకు నగరపాలక సంస్థ పరిధిలో 570మంది ఎన్యుమరేటర్లు, 75 మంది సూపర్ వైజర్లను నియమించి, శిక్షణ ఇచ్చినట్లు మౌర్య తెలిపారు.

# శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి



**రామచంద్రాపురం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ జంగా కృష్ణమూర్తి గురువారం శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించారు. పీఠం నిర్వాహకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పీఠాధిపతులు మాతాజీ వారిని దర్శించుకుని, వారి ఆశీర్వచనాలు అందుకున్నారు. పీఠంలోని ఆధ్యాత్మిక వాతావరణం, సాత్విక శక్తి ఎంతో ప్రశాంతతను చేకూర్చాయని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. లోకకల్యాణార్థం పీఠం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన శ్లాఘించారు.

# 'కాలేజ్ టు కార్పొరేట్' పుస్తకావిష్కరణ




**శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరి గ్రామ సమీపంలోని శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (SKIIMS) కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ పుస్తకం "కాలేజ్ టు కార్పొరేట్" ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ శ్రీ మిద్దెల హరి , ప్రిన్సిపాల్ డాక్టర్ గీతా దేవి, పుస్తక రచయిత (సీనియర్ జనరల్ మేనేజర్--ECL) డాక్టర్ దొరై రాజ్ , రిటైర్డ్ ఏఎస్పీ శ్రీ పి. అభిషేకం, రిటైర్డ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామిరెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌ఓడీలు, బోధన, బోధనేతర సిబ్బంది , అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ దొరై రాజ్ రచించిన కెరీర్ గైడెన్స్ పుస్తకం "కాలేజ్ టు కార్పొరేట్" ను కళాశాల కరస్పాండెంట్ శ్రీ మిద్దెల హరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ దొరై రాజ్ విద్యార్థులతో మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు కార్పొరేట్ ప్రొఫెషనల్స్‌గా ఎదగడానికి అవసరమైన 25 ముఖ్య సూత్రాలను వివరించారు. అనంతరం మిద్దెల హరి విద్యార్థులకు ఉచితంగా "కాలేజ్ టు కార్పొరేట్" కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు.




# విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలపై టీటీడీ సిబ్బందికి అవగాహన





**తిరుమల,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ సరఫరా వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు , అగ్ని ప్రమాదాల నివారణపై టీటీడీ విద్యుత్ విభాగం సిబ్బందికి గురువారం తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీడీసీ ఎల్ మాజీ సీఎండీ జె.పద్మ జనార్ధన్ రెడ్డి సిబ్బందికి ఎలక్ట్రికల్ ఇన్స్టాలేషన్, మెయింటెనెన్స్, ముందస్తు జాగ్రత్త చర్యలు వంటి పలు టెక్నికల్ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం టీటీడీ ఏడీఎఫ్ఓ పి.అనిల్ కుమార్ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈ చంద్ర శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 25 నుండి 27వ తేదీ వరకు**

# తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు



**తిరుమల, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఏప్రిల్ 25 నుండి 27 తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు :**

శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా ఏప్రిల్ 25 నుండి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**పౌరాణిక ప్రాశస్త్యం :**

పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, అంటే కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు వైకుంఠం నుండి శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన శ్రీ పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వ ఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథం తెలుపుతోంది. ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమినాటికి ముందు ఒక రోజు, తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టీటీడీ నిర్వహిస్తోంది. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు జరగడం విశేషం.

# ఆధునిక వైద్య పరికరాలతో స్విమ్స్ కంటి వైద్య విభాగం పటిష్టం





**తిరుపతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిటిడి సహకారంతో స్విమ్స్ అస్పత్రి కంటి వైద్య విభాగం ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకుని అత్యంత పటిష్టంగా రూపుదిద్దుకుంది .స్విమ్స్ హాస్పిటల్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి పేషెంట్స్ స్విమ్స్‌కు వస్తుంటారని, వారి అవసరాలకు అనుగుణంగా కంటివైద్య విభాగంలో అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తెచ్చినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు/ఉప కులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌తో కలసి ఆధునీకరించిన కంటి వైద్య విభాగాన్ని సందర్శించారు.ఆ విభాగంలోని కంటి పరీక్షలకు సంబంధించిన యంత్ర పరికరాలు, కంటి జబ్బులకు అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా కంటివైద్య విభాగాధిపతి డా. రమ్యదీప్తి మాట్లాడుతూ టిటిడి సహాయంతో స్విమ్స్ కంటివైద్య విభాగంలో అత్యాధునిక పరికరాలు సమకూరాయని, సామాన్యులకు సైతం అత్యున్నత ప్రమాణాలతో కూడిన కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా సేవలను విస్తరించినట్లు తెలియజేసారు.

**అందుబాటు లో ఉన్న అత్యాధునిక సేవలు**

కంటిశుక్లః:– రోగుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక శస్త్రచికిత్సలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.(ఫ్యాకో): అల్ట్రాసౌండ్ శక్తితో, కుట్లు లేని చిన్న కోత , ఫాకోమెషిన్ ద్వారా చేసే ఆధునిక శస్త్రచికిత్స. దీనివల్ల రోగి త్వరగా కోలుకుంటారు.

మాన్యువల్ ఎస్.ఐ.సి.ఎస్:– తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలను ఇచ్చే సురక్షితమైన శస్త్రచికిత్స. ఏ–స్కాన్ , కెరాటోమెట్రీ::– కంటిలో వేసే లెన్స్ పవర్ ను కచ్చితంగా లెక్కించే అత్యాధునిక పరికరాలు.

గ్లకోమా నిర్ధారణ మరియు చికిత్స:–

చూపును హరించే గ్లకోమాను ముందుగా గుర్తించి చికిత్స అందించడానికి ( 'విజువల్ ఫీల్డ్స్): కంటి చూపు వ్యాప్తిని, గ్లాకోమా తీవ్రతను పరీక్షించే విధానం. టోనోమెట్రీ:– కంటిలోని ఒత్తిడిని కొలిచే పరీక్ష. టాబెక్యూలెక్టమీ:– తీవ్రమైన గ్లకోమా సమస్య ఉన్నవారికి కంటి ఒత్తిడిని తగ్గించే శస్త్రచికిత్స. గ్లకోమా లో లేజర్ చికిత్సలు. రెటినా మరియు డయాబెటిక్ రెటినోపతి సేవలు: మధుమేహం (షుగర్) వల్ల కంటికి కలిగే నష్టాన్ని నివారించడానికి ప్రత్యేక విభాగం. షుగర్ వ్యాధి నియంత్రణ లో ఉన్నప్పటికీ చాలా కాలం నుండి ఉండటం వలన కంటి నరాలు దెబ్బ తినడం జరుగుతుంది. షుగర్ వ్యాది కలిగిన ప్రతి ఒక్కరు అందుబాటులో ఉన్న డయాబెటిక్ రెటినోపతీ స్క్రీనింగ్ పరీక్షలను వినియోగించుకోవచ్చు. రెటినాను సూక్ష్మంగా పరిశీలించే స్కానింగ్ విధానం: ఇది డయాబెటిక్ రెటినోపతి , ఇతర రెటినా వ్యాధుల ఇంకా నీటికాసుల వ్యాధుల నిర్ధారణకు అత్యవసరం.దీని ద్వారా సమస్యలకు తోలి దశలోనే గుర్తించి ఆలస్యం లేకుండా తగు వైద్యం ఇవ్వడం జరుగుతుంది. దీ–స్కాన్: కంటి లోపలి భాగాలను అల్ట్రాసౌండ్ ద్వారా పరిశీలించే పరీక్ష.రెటినల్ లేజర్స్ రెటినాలో రక్తస్రావం లేదా రంధ్రాలు పడినప్పుడు లేజర్ ద్వారా చేసే చికిత్స.ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్స్ రెటినా సంబంధిత వ్యాధుల చికిత్స కోసం నేరుగా కంటిలోకి ఇచ్చే ప్రత్యేక ఇంజెక్షన్లు.

అసోసియేట్ ప్రొఫెసర్ డా. ప్రభంజన్ కుమార్ మాట్లాడుతూ... స్విమ్స్ కంటివైద్య విభాగానికి ప్రతిరోజు దాదాపు 150 వరకు ఓపిలు వస్తున్నాయని,నెలకు దాదాపు 100 ఆపరేషన్లు సైతం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్లన్నీ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ మరియు తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రాణధాన పథకాల ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

స్విమ్స్ సంచాలకులు , ఉపకులపతి డా. ఆర్. వి. కుమార్ మాట్లాడుతూ కంటివైద్య విభాగంలో నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ రంగ సంస్థగా స్విమ్స్ ఈ అత్యాధునిక సేవలను అతి తక్కువ ఖర్చుతో సామాన్య ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన వారికి డా. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, కార్పొరేట్ సంస్థల ఇన్సూరెన్స్ స్కీమ్స్, ఆరోగ్య భద్రతల వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయని వీరికి ఉచిత వైద్య సేవలు అందిస్తామని, కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారు స్విమ్స్ హాస్పిటల్ లోని ఆప్తల్మాలజీ (కంటి వైద్య) విభాగాన్ని సంప్రదించగలరని తెలిపారు.




# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

**- డ్రాప్ ఔట్ లేకుండా చూడాలి - విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి**

**- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలి - కలెక్టర్ వెంకటేశ్వర్**

**తిరుపతి,ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ.. విద్యాశాఖ మంచి కార్యక్రమాలతో ముందుకు వెడుతోందని, డ్రాప్ ఔట్స్ లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో 'మన సంకల్పం విద్యా ప్రగతి' కార్యక్రమంలో భాగంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్, ఫౌండేషనల్ లెటర్స్ న్యూమరసి, ఆర్వో ప్లాంట్ నిర్వహణ పై జిల్లాలోని హెచ్‌ఎం లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిలు జిల్లాలో 20, 23 శాతం మంది ఉన్నారని, శిశు సంక్షేమ శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తే ఇలాంటివి జరగకుండా చూడవచ్చునన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఎన్రోల్మెంట్ శాతాన్ని పెంచాలని కోరారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చాయని, రాబోయే సంవత్సరంలో జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల వల్లే సాధ్యమవుతుందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్ గా ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనేక రకాలైన కార్యక్రమాలు అమల్లో భాగంగా అపార ఐడి నమోదు, పరీక్ష పే చర్చ, రిజిస్ట్రేషన్ స్కూల్స్ రిస్ట్రక్చర్ మెగా పీటిఎం, వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మెగా డీఎస్సీ కార్యక్రమంలో తిరుపతి నుంచి విజయవాడ తీసుకువెళ్లే విషయంలో అసౌకర్యం కలగకుండా తీసుకెళ్లడం జరిగిందన్నారు. అన్ని కార్యక్రమాల్లో కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు మనం చేస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో, రెండో స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో 2026–27 విద్యా సంవత్సరానికి ఎన్రోల్మెంట్ డ్రైవ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ శాతాన్ని పెంచాలనే పట్టుదలతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డులు పెట్టేలా చూడాలన్నారు. గ్రామ స్థాయి వార్డు స్థాయిలో ఎన్విరాన్మెంట్ డ్రైవ్ పై డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలని తెలిపారు.

# జిల్లాలో సెన్సస్ ఆపరేషన్స్‌కు సిద్ధం

**-జిల్లాను 42 చార్జిలుగా విభజించి సమగ్ర వ్యవస్థ ఏర్పాటు**

**-సిబ్బందికి బహుళ దశల్లో శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి**

**-వందశాతం ఆన్‌లైన్ సెన్సస్ విధానం, మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ**

**-ప్రజలకు సులభమైన విధానం ద్వారా నమోదు అవకాశం**

**- కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో జరగబోయే 2026 –2027 సెన్సస్ ఆపరేషన్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సెన్సస్ కార్యక్రమంపై డీ ఆర్ ఓ నరసింహులుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సెన్సస్ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర స్థాయిలో సెన్సస్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు చార్జ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారన్నారు. జిల్లాను 42 చార్జలుగా విభజించామని, 36 మండలాలు, 5 మున్సిపాలిటీలు , తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఒక ప్రత్యేక చార్జ్‌గా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి చార్జ్‌ను హౌస్ లిస్టింగ్ బ్లాక్స్‌గా విభజించి, ప్రతి బ్లాక్‌కు ఎన్యూమరేటర్లు,పర్యవేక్షణకు సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. సెన్సస్ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో చార్జ్ ఆఫీసర్లకు మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ, హ్యాండ్స్–ఆన్ వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు చెప్పారు. అదనంగా మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు గుర్తించి, ఎన్యూమరేటర్లు , సూపర్వైజర్లకు దశల వారీగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 23వ తేదీ నుండి ఎన్యూమరేటర్లకు తుది దశ శిక్షణ ప్రారంభమవుతుందని, ఈసారి సెన్సస్ ప్రత్యేకతగా 100శాతం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడం ముఖ్యాంశమని తెలిపారు.ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ జరుగుతుందని, దీని వలన సమయం ఆదా కావడంతో పాటు డేటా సేకరణ కచ్చితత్వం పెరుగుతుందని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ విధానం ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. మే 1 నుండి హౌస్ లిస్టింగ్ దశ ప్రారంభమవుతుందని, ఈ దశలో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి గృహాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2027లో జనాభా లెక్కింపు రెండో దశ ఉంటుందని చెప్పారు. సెన్సస్ ద్వారా సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, ఈ డేటాను ఎటువంటి సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయరని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలకు సెన్సస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మీడియా సహకారం అవసరమని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. 15 సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్న ఈ సెన్సస్‌ను విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని జికలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027